వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 28 అక్టోబర్ 2024

ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్టీసీ ముఖ్య ఉద్దేశం

- త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- నూతన బస్సులను ప్రారంభించిన రాష్ట్ర రవాణాశాఖామంత్రి

రాయచోటి, అక్టోబరు 27, ప్రభాతవార్త: ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్టీసీ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో 10 నూతన ఆర్టీసీ బస్సులను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్టీసీ లక్ష్యమన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడడం జరుగుతోందని త్వరలో మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పిస్తామన్నారు. ఈ నూతన బస్సులు రాయచోటి ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాదుకు 2 ఇంద్ర బస్సులు, మదనపల్లె 1వ డిపో నుంచి 1 సూపర్ లగ్జరీ ఎక్స్‌ప్రెస్, 2వ డిపో నుంచి 1 బస్సు, పీలేరు డిపో నుంచి 1, పుంగనూరు డిపో నుంచి 2 పల్లె వెలుగులు నడపడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి బెలూన్లతో అలంకరించిన 10 బస్సులను జెండా ఊపి ప్రారంభించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

రాయచోటి, అక్టోబరు 27, ప్రభాతవార్త: అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం నాయబ్ సాబ్‌వీధిలో జమాల్‌బాషా విక్రయిస్తున్న 1200 గ్రాములు గంజాయి, మొబైల్ ఫోన్ను పోలీసులు స్వాధీనం చేసుకొని అతన్ని అరెస్టు చేశామని రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు. ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు

- అన్ని పాఠశాలలో ఒక పిరియడ్ క్రీడకు కేటాయించేందుకు చర్యలు - రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

కడప, అక్టోబర్ 27, ప్రభాతవార్త ప్రైవేటు పాఠశాలల న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం కడప నగరంలోని ఉమేష్‌చంద్ర కళ్యాణ మండపంలో అన్ఎయిడెడ్ పాఠశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్‌లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాక మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలు కూడా ఒక కన్నుగా ఉంటాయని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ప్రభుత్వంలో అన్ని రంగాలను అభివృద్ధి చేసే దిశగా ముందుకెళ్తుందని చెప్పారు. ప్రైవేటు పాఠశాలల సమస్యలు తమ దృష్టికి వచ్చాయో వాటన్నింటిని న్యాయపరంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలలను నిర్వహించడం జరుగుతోందని, అదేవిధంగా ప్రైవేటు పాఠశాలలు కూడా పేద విద్యార్థుల కోసం ఆదరించడం జరుగుతోందని చెప్పారు. అలాగే వారు కూడా ప్రైవేటు పాఠశాలల చదివి ఉన్నతస్థితికి ఎదిగారని, మంచి స్థానాలలో ఉన్నారన్నారు. ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేటు పాఠశాలల ఉనికిని కాపాడేందుకు ఈ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. న్యాయపరమైన సమస్యలను పరిశీలించి రాష్ట్ర విద్యా శాఖమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకునేందుకు దోహదపడతామన్నారు. ప్రైవేటు పాఠశాలల బస్సులపై డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారచర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు మానసికంగానే కాకుండా శారీర దృఢత్వానికి అన్ని పాఠశాలలకు ఒక చట్టాన్ని తీసుకురాబోతున్నామని పాఠశాలల ఒక పీరియడ్ క్రీడకు కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం అన్ని రంగాలను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రైవేటు పాఠశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. టిడిపి పోలిట్ బ్యూరో శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యతను ఇస్తూ ముందుకెళ్తోందని ప్రైవేటు పాఠశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మా ప్రెసిడెంట్ శ్రీనివాసులరెడ్డి, సెక్రటరీ రమేష్‌రెడ్డి తదితర ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నేరాల కట్టడిలో నేరస్థుల ఆటకట్టించడంలో
సీసీ కెమెరాల పాత్ర కీలకం

- వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి
- మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులకు అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ

కడప క్రైం, అక్టోబరు 27, ప్రభాతవార్త: నేరాలను నిరోధించడంలో, నేరస్థులను గుర్తించి అరెస్టు చేయడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమైందని, షాపుల వినియోగదారుల భద్రతను దష్టిలో ఉంచుకొని జిల్లాలోని వ్యాపారులు తమ వంతు సామాజిక బాధ్యతగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు సూచించారు. ఆదివారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని వివిధ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వ్యాపారులకు సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరించారు. ఏపీ పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ 2013 మేరకు వంద కంటే ఎక్కువ మంది గుమిగూడి ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో ఈ చట్టం వర్తిస్తుందన్నారు. రికార్డు అయిన సీసీ ఫుటేజీ వీడియోలు 30 రోజుల పాటు నిల్వ ఉండేలా చూడాలని తెలిపారు. గత వారం రోజుల వ్యవధిలో సీసీ కెమెరాల వల్ల మూడు కేసులను చేధించడం జరిగిందన్నారు. గత నెల రోజుల వ్యవధిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న షాపుల సీసీ కెమెరాలను రోడ్డు వైపు తిప్పి ఉంచాలన్న పోలీసు శాఖ సూచన మేరకు దాదాపు 1700 సీసీ కెమెరాలను రోడ్డు వైపు తిప్పడం సత్ఫలితాలు ఇచ్చిందన్నారు. బాలుడు కిడ్నాప్ అంటూ వచ్చిన ఫిర్యాదుపై విచారణలో అది ఫేక్ కిడ్నాప్‌గా తేలిందన్నారు. కడప నగరంలో ఓ వ్యక్తిపై దాడి కేసులో ద్విచక్ర వాహనాల నెంబర్లు, నిందితుల ఆనవాళ్లను గుర్తించడంలో సమీపంలోని షాపుల సీసీ కెమెరాలు ప్రధాన పాత్ర పోషించాయన్నారు. వై చైన్ స్నాచర్‌ను అరెస్టు చేయడంలో కూడా సీసీ కెమెరాలు కీలకంగా వ్యవహరించాయని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా అంతటా రెండు నెలల వ్యవధిలో వీలైనన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొని నేర రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. వ్యాపార వర్గాల వాట్సాప్ గ్రూపుల్లో ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిని భాగస్వామిని చేసి మీ సమస్యలు ఏమైనా ఉంటే వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతోనే కమ్యూనిటీ పోలీసింగ్ సాధ్యమని, ఆయా వర్గాల ప్రజలతో సమావేశం నిర్వహిస్తూ వారి అభిప్రాయాలు, వారి నుంచి వచ్చే సమాచారం తెలుసుకొని మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఎస్పీ తెలిపారు. జిల్లాను నేరరహితంగా చేసేందుకు చేపట్టిన కార్యక్రమంలో మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యులకు ఎస్పీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ హేమకుమార్, కడప వన్‌టౌన్ సీఐ రామకృష్ణ, టుటౌన్ సీఐ నాగార్జున, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ మధుమల్లేశ్వరరెడ్డి, జిల్లాలోని క్లాత్ మర్చంట్స్, గోల్డ్‌షాప్‌లు, ఫ్యాన్సీ, కిరానా, లారీ అసోసియేషన్, ఆయిల్ మిల్, బిల్డింగ్ వర్కర్స్, పెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, సినిమా థియేటర్ల అసోసియేషన్ వారు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్లకు 'సభ్యత్వ' పరీక్ష

- పరీక్ష తర్వాతే నామినేటెడ్ పదవుల పందేరం - అధికార పక్షంలో సత్తా చాటేదెవరో? - ఆ నియోజకవర్గాలపై అధిష్టానం ఫోకస్

రాజంపేట అర్బన్, అక్టోబర్ 27, ప్రభాతవార్త: అధికార తెలుగుదేశం పార్టీలో సభ్యత్వ నమోదు ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా పాలక పక్షం సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకొంది. కీలక నేతలకు సభ్యత్వ నమోదు అగ్ని పరీక్షగా మారనుంది. గత సభ్యత్వ నమోదు ఎన్నికల ముందు చేపట్టడం ఈ ప్రక్రియ పట్ల చాలా మంది టికెట్ ఆశించిన నేతలు అంటిముట్టనట్లు వ్యవహరించారు. అలాంటి వారికి అధిష్టాణం ఎన్నికల్లో షాక్‌ఇచ్చింది. టికెట్ ఆశించిన వారే కాకుండా రిజర్వుడు నియోజకవర్గాల్లో ఇంచార్జ్‌లు సభ్యత్వ నమోదును పట్టించుకోలేదు. సమీక్షల సంధర్భంగా స్వయంగా పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా సభ్యత్వ నమోదులో వెనుకబడిన నియోజకవర్గాలకు ముందస్థు హెచ్చరికలు కూడ జారీ చేశారు. స్పందించిన నేతలు సరిదిద్దుకున్నారు. పట్టించుకోని నేతలు ఎన్నికల్లో ఫలితం అనుభవించారు. సభ్యత్వ నమోదు పట్టని నేతలు నియోజకవర్గాల్లో పార్టీని ఎలా ముందుకు తీసుకువెళుతారన్నది అధిష్టాణం ప్రశ్న. పార్టీ నిర్మాణంలో సభ్యత్వ నమోదు ఎంతో క్రియాశీలకమైంది. ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలకు సభ్యత్వం బట్టే రాష్ట్రంలో పార్టీ సత్తా తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీ సభ్యత్వం పక్కాగా చేపట్టకపోతే పార్టీ పునాదులు అదేవిధంగా ఉంటాయి. అందుకే రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్న తెలుగుదేశం పార్టీ బలంగా ఉంటుంది. ప్రస్తుతం పార్టీ అధికారంలో కూడ ఉండటంతో సభ్యత్వ నమోదుపై అధిష్టాణం బారీ అంచనాలతో ఉంది. ఈ అంచనాలు సఫలీకృతం కావాలంటే నియోజకవర్గాల్లో శాసనసభ్యులు, ఇంచార్జ్‌లు సభ్యత్వ నమోదుపై దృష్టి సారించి సత్తా నిరూపించుకోవాల్సి ఉంది. వారి సత్తా సభ్యత్వ నమోదులో స్పష్టం అవుతుంది. అందుకే అధిష్టాణం నామినేటెడ్ పోస్టుల నియామకానికి కూడ బ్రేక్ వేసిందని పార్టీ వర్గాల సమాచారం. నియోజకవర్గ, మండల పంచాయతీ స్థాయి నేతలు క్రియాశీలకంగా పనిచేస్తేనే సభ్యత్వ నమోదు సస్సెక్ అవుతుంది. లేదంలే అంతంతమాత్రంగానే ఉంటుంది. కడప,అన్నమయ్య జిల్లాల్లో ఈ దఫా సభ్యత్వ నమోదుపై పార్టీకి పెద్ద అంచనాలు ఉన్నాయి. గత 20ఏళ్లలో తెలుగుదేశం పార్టీకి రెండు జిల్లాలో ఈ ఎన్నికల్లో వచ్చినన్ని సీట్లు ఎప్పుడూ రాలేదు. అందుకే అధిష్టాణం సభ్యత్వ నమోదుపై ఎక్కువ అంచనా వేస్తోంది. గత సభ్యత్వ నమోదు ప్రక్రియలో రాజంపేట నియోజకవర్గంలో అంతత మాత్రంగానే జరిగింది. నియోజకవర్గం, జిల్లాలోనే వెనుకబడి ఉందని ఒక దశలో పార్టీ అధినేత హెచ్చరించారు కూడ. అయితే నియోజకవర్గ బాధ్యులు ఆ స్థాయిలో స్పందించకపోవడం వల్ల ఎన్నికల్లో ఆయనకు అధిష్టాణం ఎలా ఝుల్క్ ఇచ్చిందో అందరికి తెలిసిందే. అదేవిధంగా రైల్వే కోడూరులో కూడ సభ్యత్వ నమోదు పట్ల నియోజకవర్గ బాధ్యులు చిత్తశుద్ధితో పనిచేయాలేదు. ఫలితంగా ఎన్నికల్లో ఇంచార్జ్ పదవి కూడ లేకుండా కోల్పోవలసిన పరిస్థితి ఏర్పడింది. అలాగే తంబళ్లపల్లె నియోజకవర్గంలో కూడ నియోజకవర్గ ఇంచార్జ్ సభ్యత్వ నమోదు పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉండే విశయాల్లో పలుమార్లు పార్టి అధిష్టాణం హెచ్చరించింది. అయినా మార్పు రాలేదు. ఫలితంగా ఎన్నికల్లో ఆయనకు కూడ ఊహించని షాక్ ఇచ్చారు. కొత్త అభ్యర్థిని రంగంలోకి దించారు. అయితే ఈ నియోజకవర్గంలో పాత, కొత్త నేతలు సమన్వయంతో పనిచేస్తారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది. మదనపల్లె నియోజకవర్గంలో అధికార పార్టీలో నేతలు పదవులకోసం పోటీ పడుతున్నారు. ఈ పోటి సభ్యత్వ నమోదు పట్ల ఎలా వ్యవహరిస్తారో తెలియాల్సి ఉంది. కడప జిల్లాలో బద్వేల్ సెగ్మెంట్‌లో పొత్తులో భాగంగా బీజేపికి టికెట్ కేటాయించడంతో పార్టీ ఓటమి పాలు కావడం తెలుగుదేశం శ్రేణులు నిరాశ, నిస్పృహల్లో ఉన్నారు.

పార్టీ ఇంచార్జ్‌గా ఎప్పుడూ చక్రం తిప్పుతు న్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సభ్యత్వ నమోదు విశయంలో ఎలా ముందుకు వెళతారో ఎలా పనిచేస్తారో వేచి చూస్తే కాని తెలియదు. ఇక మిగిలింది పులివెందుల నపియోజకవర్గం ఇక్కడ ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ఉన్నారు. వీరిద్దరు సభ్యత్వ నమోదులో పోటి పడి పనిచేసే అవకాశాలు లేకపోలేదు. సభ్యత్వ న మోదు లక్ష్యాలను త్వరలో జిల్లా ఇంచార్జ్ మంత్రులు, పార్టీ జిల్లా అధ్యక్షులతో సమావేశం నిర్వహించి ఖరారు చేస్తారని తెలుస్తోంది. జమ్మలమడుగు సెగ్మెంట్‌లో ఇంచార్జ్ భూపేష్ రెడ్డి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకునే అవకాశం లేకపోలేదు. ఒక విధంగా పార్టీ గెలవని నియోజకవర్గాల్లో ఇంచార్జ్‌లకు కీలక నేతలకు సభ్యత్వ నమోదు అగ్ని పరీక్షే. సభ్యత్వ నమోదే సక్సెస్ బట్టే నామి నేటెడ్ పదవులు లభిస్తాయని ప్రచారం కూడ లేకపోలేదు.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

- సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు
- ఫోన్ చేయవలసిన ల్యాండ్ లైన్ నెం. 08562 244437

కడప, అక్టోబర్ 27, ప్రభాతవార్త ప్రజాసమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న డయల్‌యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ అదితిసింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి 08562 244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవలసినదిగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

ఉరి వేసుకుని విద్యార్థిని మృతి

వేంపల్లె, అక్టోబరు 27, ప్రభాతవార్త : వేంపల్లెలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెంది ఉర్దూ కాలేజిలో ఇంటర్‌మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న షేక్ సానియా(21) శనివారం ఇంటిలో ఎవరూ లేనిసమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. సానియా టివి ఎక్కువగా చూస్తుండడంతో తండ్రి మందలించాడని, కళాశాలకు వెళ్లి బాగా చదువుకోవాలని మందలించాడన్నారు. దీంతో ఆ విద్యార్థిని మనస్తాపానికి గురై ఉరి వేసుకుని మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి షామీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కడప నుండి హైదరాబాద్‌కు ఫ్లైట్ ప్రారంభం

కడప, అక్టోబరు 27, ప్రభాతవార్త కడప నుండి హైదరాబాద్‌కు ఈ నెల 27వ తేది నుండి ప్రతి రోజు వెళ్లే ఇండిగో ఫ్లైట్‌ను ఆదివారం రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కడప విమానాశ్రయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ 27వ తేది నుండి ప్రతి రోజు కడప నుంచి హైదరాబాద్‌కు ఇండిగో ఫ్లైట్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కడప నుండి హైదరాబాద్‌కు వెళ్లాలంటే ఎంతో సమయం పడుతుందని ప్రయాణికుల సౌకర్యాన్ని వారి సమయాన్ని వృధా చేయకుండా విమాన సర్వీసులు ప్రారంభించడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో కడప నుండి ఇతర ప్రాంతాలకు మరిన్ని విమాన సర్వీసు సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని పీహెచ్‌సీ

- పెచ్చులూడుతున్న పాత భవనం
- పనిచేయని నీటి కుళాయిలు
- భయంగా గుప్పిట్లో సిబ్బంది విధులు
- అధికార ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలంటున్న ప్రజలు

చిట్వేలి, అక్టోబరు 27, ప్రభాతవార్త: చిట్వేలి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవన పనులు పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో స్థానిక నాయకుల చొరవతో కోటికి పైగా నిధులు వెచ్చించి అవసరానికి తగ్గట్టు సరికొత్తగా నూతన భవనాన్ని నిర్మించారు. సార్వత్రిక ఎన్నికల ముందే ఆసుపత్రిని ప్రారంభించాల్సి ఉండగా ఎన్నికల హడావిడిలో పీహెచ్‌సీ ప్రారంభించాల్సి ఉండగా ఎన్నికల హడావిడిలో పీహెచ్‌సీ ప్రారంభానికి నోచుకోలేదు. కాగా ప్రస్తుతం ఏర్పాటైన కూటమి ప్రభుత్వం పీహెచ్‌సీ నూతన భవనాన్ని ప్రారంభించాల్సి ఉంది. పీహెచ్‌సీ సిబ్బంది పాత భవనంలో స్లాబు పెచ్చులూడుతుండడం గదులకు నీటి సరఫరా లేకపోవడంతో సిబ్బంది చాలా ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. ఇన్ని ఇబ్బందులను గుర్తించి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడే వైద్యులకు, సిబ్బందికి రక్షణగా సౌకర్యంగా ఉండే నూతన ఆసుపత్రి భవనాన్ని వెంటనే ప్రారంభించాలని మండల ప్రజలు జిల్లా యంత్రాంగాన్ని, ప్రజా ప్రతినిధులను, స్థానిక నాయకులను కోరుతున్నారు.

ప్రారంభంకాని నూతన భవనం

శిధిలావస్థలో ఉన్న పాతభవనం

రెడ్ లేడీ తైవాన్ - అధిక దిగుబడికి సోపానం

రైల్వే కోడూరు అర్బన్, సెప్టంబర్27,ప్రభాత వార్త : రైల్వే కోడూరు నియోజకవర్గం రాష్ట్రంలోనే కాదు దేశ వ్యాప్తంగా పండ్ల తోటల పెంపకానికి ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతంలో అధికంగా పండ్ల తోటలైన అరటి, బొప్పాయి, మామిడి, తమలపాకు, సీనే, పనస తోటలను అధికంగా సాగు చేస్తుందనే పేరుంది ఈ ప్రాంతాల్లో సుమారు 25 పైగా పండ్లతోటలు నర్సరీలు కూడా ఉన్నాయి. అధికంగా ప్రతిఏటా ఈ నియోజకవర్గంలో బోప్పాయి, అరటి సాగు వేల హెక్టర్లలో చేస్తారు. అయితే ప్రతి ఏటా ప్రకృతి పగపట్టో, నర్సరీల నుంచి సరఫరా చేసే మొక్కలు సరిగా దిగుబడినివ్వకపోవడం వంటివి జరుగుతుంటాయి. అయితే బొప్పాయిలో అనేక రకాలు మాధురి, కోటు అనే రకాలతో పాటు పలు రకాల పండ్ల మొక్కల నర్సరీలను పెంచుతారు. అయితే మంచిది గుబడినిచ్చే రెడ్‌లేడీ 786 తైవాన్ బొప్పాయి రకం రైతుకు అధిక దిగుబడినిస్తున్నట్లే రైతులు చెబుతున్నారు. కోడూరు ప్రాంతంలో సంగరాజు రవికుమార్ రాజు అనే నర్సరీ యజమాని రైతులు తెచ్చుకున్న విత్తనాలను 40 నుంచి 60 రోజుల వరకు మొక్కలను పెంచి ఒక్కో మొక్కకు 3.50రూపాయలు పొందుతామన్నారు. ఎవరైనా ముందే ఆర్డర్లు ఇస్తే తాను కూడా ఈ విత్తనాలను నర్సరీలో పెంచి రైతుకు అందజేస్తామన్నారు. తాను సరఫరా చేస్త ఒక్కో మొక్కకు రూ.11లు తీసుకుంటామన్నారు. పూనే నుంచి ఈ విత్తనాలను సరఫరా చేయడం జరుగుతుందని కిలో విత్తనాలు సుమారు రూ.4లక్షలు ఉంటాయన్నారు. ఈ కిలో విత్తనాలు సుమారు 65 ఎకరాలకు నాటుకునేందుకు మొక్కలు వస్తాయన్నారు. ప్రతి ఏటా తన నర్సరీ నుంచి రైతులకు విత్తనాలు అందించే రైతుల నుంచి 10లక్షలకు పైగా మొక్కలను పెంచి అందజేస్తానన్నారు. తాను సొంతంగా కూడా 10 నుంచి 20 లక్షల మొక్కలు పెంచి విక్రయిస్తానన్నారు. గత 18 సంవత్సరాలనుంచి రైల్వే కోడూరు నర్సరీలలో రెడ్‌లేడీ 786 తైవాన్ బొప్పాయి మొక్కలనే అధికంగా పెంచి రైతులకు అందజేస్తానన్నారు. వీటి ద్వారా సాగు చేసే రైతులు అధికంగా దిగుబడులు తీసి మంచి లాభాలనే పొందుతున్నారన్నారు. ప్రతి ఏటా దదాపు 2కోట్ల మొక్కలకు పైగా బొప్పాయి సాగు రైతులు చేస్తారని నర్సరీ యజమాని తెలిపారు.

దీపంతో దీపావళి
నేటి నుంచి ధరఖాస్తులు ప్రారంభం

రాజంపేట, అక్టోబర్ 27, ప్రభాతవార్త : రాష్ట్ర కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మొదలు పెట్టారు. మొట్ట మొదటగా దీపావళి పండుగను దీపం పథకంతోనే ప్రారంభించి ఉచిత గ్యాస్ కనెక్షన్‌లను పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ఇందుకోసం ఈనెల 28 నుంచే ధరఖాస్తులు చేసుకునేందుకు అనుమతులిచ్చారు. రాష్ట్రంలో మహిళలకు ప్రతి ఏటా 3 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇచ్చేందుకు ప్రభుత్వం సూపర్ 6 పథకాలను ప్రారంభించి కంకణం కట్టుకుంది. అయితే ఈ గ్యాస్ సిలిండర్లు పొందే వారు ముందే నగదు పెట్టి సిలిండర్ కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన 48గంటల లోపే తిరిగి వారి వారి అకౌంట్లలో సబ్సిడీ పోను మిగిలిన డబ్బులు జమ చేయడం జరుగుతందన్నారు. గ్యాస్ సిలిండర్ ధర ప్రభుత్వం రూ.876లకు అందజేస్తుందని దీనిలో రూ.25లు సబ్సిడీ పోను రూ.851 లు సిలిండర్‌కు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో రూ.1.55 కోట్ల గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయి. వీటిల్లో ఉచితంగా గ్యాస్ కలెక్షన్‌లకు 1.47 కోట్లు మంది అర్హులన్నారు. ఇదేవిధంగా ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం క్రింద 9.65 లక్షల కనెక్షన్‌లు ఉన్నాయి. ఇదే విధంగా అన్నమయ్య, కడప ఉమ్మడి జిల్లాల్లో అన్నమయ్య జిల్లాకు సంబంధించి 5,16,889 కనోక్షన్‌లు ఉండగా దీపం పథకం క్రింద 2,03,085 కనెక్షన్‌లు ఉన్నాయి. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద 12,929 కనెక్షన్‌లు, 34 ఏజెన్సీలు ఉన్నాయి. అదేవిధంగా కడప జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్‌లు 12,47,000 ఉండగా దీపం పథకం క్రింద 3,69,000లు ఉజ్వల యోజన క్రింద 50వేలా 500లు 62 ఏజెన్సీల కింద ఉన్నట్లు ఆ ఉమ్మడి జిల్లాల డియస్ఓలు తెలిపారు. రాష్ట్రంలో ఆ గ్యాస్ కనెక్షన్‌లు హెచ్‌పీ, ఇండియన్, భారత్ సంబంధించిన 3 కంపెనీలు ఉన్నాయి.

ఉల్లి రైతులకు ప్రభుత్వం అండగా ఉండాలి

యర్రగుంట్ల, అక్టోబర్ 27, ప్రభాతవార్త:
ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో యర్రగుంట్ల మున్సిపాలిటీలోని మార్కెట్ యార్డ్ నందు సుంకేసుల, తిప్పలూరు, కోడూరు గ్రామాలకు చెందిన ఉల్లి రైతులు మార్కెట్ యార్డులోని ప్లాట్ఫారం మరియు ఖాళీ స్థలంలో ప్లాస్టిక్ పట్టల పరచుకొని అరబెట్టుకోవడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవి సుబ్బారెడ్డి, కాంగ్రేస్ పార్టీ కిషన్ జిల్లా అధ్యక్షులు ఇల్లురు కృష్ణారెడ్డి, కాంగ్రేస్ పార్టీ సీనియర్ నాయకులు ఓబయ్య, శివాలు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ తుఫాను వల్ల పూర్తిగా పంట దెబ్బతిని దిగుబడి సగానికి సగం తగ్గిపోవడం చాలా బాధాకరమని, ధర పది రోజుల క్రితం టన్ను 35000 వరకు ఉండటం వలన రైతులకు కొంత మేలు జరిగేది, కానీ ప్రస్తుతం 10,000 నుండి 15000పడిపోవడం వల్ల రైతులు పూర్తిగా నష్టపోవడం జరిగిందన్నారు. ప్రకృతి వైపరిత్యాలలను తట్టుకొని రైతులు నష్టపోకుండా పంట దిగుబడి తగ్గడంతో చాలా నష్టాలు చూడవలసి వస్తుంది. రైతులను ఇటువంటి గడ్డు కాలంలో కాపాడేందుకు శీతల గిడ్డంగులు అత్యంత అవసరం అని, ఈ దిశగా ఉద్యాన శాఖ అధికారులు చర్యలు చేపట్టి శీతల గిడ్డంగులు ఏర్పాటుకు వచ్చినప్పుడే రైతులకు నష్టం కలగకుండా ఉంటుందన్నారు. రైతన్నని ఆదుకునేందుకు ఉల్లి రైతులకు ఎకరాకు 25వేల రూపాయలు పెట్టుబడి సాయం కింద నష్టపరిహారం ఇవ్వడం పెద్ద ఎత్తున ఉల్లి సాగు చేశారని గుర్తు చేశారు.

భారతీయకిసాన్ సంఘ్ రాష్ట్ర నూతన అధ్యక్షులుగా సహదేవరెడ్డి ఎకగ్రీవ ఎన్నిక

రాజుపాళెం, అక్టోబర్ 27, ప్రభాతవార్త.
మండల పరిదిలోని వెల్లాల గ్రామానికి చెందిన ఉమ్మడి సహదేవరెడ్డి భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఆదివారం రాష్ట్ర భారతీయకిసాన్ సంఘ్ రాష్ట్ర మహా సభలో ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా ఆయనను రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు రైతులకు, రైతు నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ రైతుల సమస్యల పరిష్కారంనకు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా ప్రధానమంత్రి పసల్‌భీమా రైతువాటాను తగ్గించి ప్రతి రైతుకు భరోసా కల్పించుటకు తనవంతు పోరాడుతానన్నారు. కౌలు రైతుల సమస్యలను పరిష్కరించుతానన్నారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర మహాసభలో భారతీయకిసాన్ సంఘ్ రాష్ట్ర కొత్త కార్యవర్గం ను ఎన్నుకున్నారు. దీంట్లో బాగంగా మండలానాకి చెందిన రైతునాయకుడిని రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

చలో విజయవాడ కరపత్రాలు విడుదల

యర్రగుంట్ల, అక్టోబర్ 27, ప్రభాతవార్త:
ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకి ఉందని సుప్రింకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధుల మహాసభను ఏపీ ఎంఆర్పీఎస్ 11వ రాష్ట్ర సంధర్భంగా నవంబర్ 5 2024తేదిన విజయవాడలోని హనుమంతరావు గ్రంధాలయంలో ఏపీ ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ నాయకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని, ఆదివారం నాడు చిలమకూరు ఇందిరా కాలనీ డప్పు చర్మ కళాకారుల రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం మాదిగ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ కలిసి జయప్రదం చేయాలని వాడవాడల కరపత్రాలు పంచుతూ అందరికి తెలియజేశారు. దండ వీరయ్య మాదిగ నాయకత్వంలో రాష్ట్రాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సలహాదారులు సహదేవుడు మాదిగ, రాష్ట్ర ఎంఈఎఫ్ అధ్యక్షుడు శివరాం మాదిగ, యర్రగుంట్ల మండల అధ్యక్షులు బూసుపాటి రామాంజనేయులు మాదిగ, చిలమకూరు గ్రామం మాదిగ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి సంవత్సరికం కార్యక్రమంలో పాల్గొన్న సుగవాసి

చిన్నమండెం,అక్టోబర్ 27, ప్రభాతవార్త:
చిన్నమండెం మండలంలోని దిగువగొట్టివీడు గ్రామం బలిజపల్లెలో ఎద్దుల వెంకటరమణ మొదటి సంవత్సరికం ఆదివారం జరిగిగిన కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి, టిటిడి పాల కమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబు పాల్గొన్నారు. ఎద్దుల సురేష్ పిలుపు మేరకు ఆయన పాల్గొని వెంకటరమణకు నివాళులు అర్పించారు. ఆయన వెంట టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వేలాదిమంది భక్తులతో కిటకిటలాడిన గంగమ్మ ఆలయం

లక్కిరెడ్డిపల్లె,అక్టోబర్ 27, ప్రభాతవార్త:
గంగమ్మ దేవత వర్షాలు కురిపించి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండేలా కరుణించి కాపాడు తల్లీ అంటూ ఆదివారం గంగమ్మ దేవతకు వేలాది మంది భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతున్న శ్రీఅనంతపురం గంగమ్మ దేవత ఆలయానికి భక్తులు రావడంతో క్యూ లైన్‌లలో కిక్కిరిసింది. భక్తులకు తాగునీటి ఇబ్బందులు మాత్రం తప్పలేదు. ఆలయ ప్రాంగణం భక్తులతో రద్దీగా మారి చిన్నపాటి జాతరను తలపించింది. ఆలయ చైర్మన్ రెడ్డెయ్య, ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. చుట్టు పక్కల ప్రాంతాల వారు కాకుండా ఇతర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకోవడానికి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ పూజారులు చెల్లు వంశీయులు భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కురులు వేగంగా పెరగాలా?

పుట్టుకుచ్చులా అందంగా, పొడవుగా ఉండే కురులు.. కోరుకోని అమ్మాయి ఉంటుందా? కానీ ఈ కాలుష్యానికి ఊడటమే కానీ పెరగడం ఎక్కడుంది? ఈ చిన్న చిట్కాలను పాటించండి. వేగంగా పెరుగుతాయి అంటున్నారు నిపుణులు. అవేంటో చూద్దామా?

★ తల ఆరోగ్యంగా ఉండాలంటే తరచూ దాన్ని శుభ్రం చేయడం తప్పని సరి. కానీ ఆరబెట్టడమే పెద్ద పని. అందుకే చాలామంది డ్రైయ్యర్‌ని వాడుతుంటారు. కానీ దాని వేడి కురుల పెరుగుదలను అడ్డుకుంటుందని తెలుసా? స్టైలింగ్, స్టైలింగ్, స్ట్రెయిట్‌నింగ్ కోసం వాడేవే కాదు.. ఎండలో అతిగా తిరగడం, జడను లాగివేయడం, తువాలుతో తడిపోవాలని కొట్టడం వంటివీ చేటు చేసేవే. వీటికి దూరంగా ఉండండి. ★ కండిషనర్ వెంట్రుకలకు బాగా పడుతుంది. ఇప్పుడైతే చిక్కులు బాగా వస్తాయి. అని తడి తలమీద దువ్వెన ఉపయోగిస్తున్నారా? మేలు చేయడం మాట అటుంచితే కుదుళ్లకు హాని. ఫలితమే కురులు రాలడం. కాబట్టి, తడి వెంట్రుకలు ఆరేవరకూ ఆగండి. తరవాతే దువ్వండి. ★. ఒకప్పుడు సమస్యేదైనా నిపుణులను సంప్రదించేవారు. మరి ఇప్పుడు? అరచేతిలోనే సమాచారం. దాని సలహాతో ఇష్టారీతిన సప్తిమెంట్లను వాడేస్తున్నారు. మీదీ అదే ధోరణా? ఇవి మేలు చేయకపోగా చేటు చేస్తాయి.

అనుభవాలనే పాఠాలుగా నేర్చుకుని..

వాళ్లెవరూ ఎంబిఎలు చదివి వ్యాపారంలో అడుగుపెట్టిన వాళ్లు కాదు. అనుభవాలనే పాఠాలుగా మార్చుకున్నా వాళ్లు. సవాళ్లతోనే మెలకువలు నేర్చుకున్న ఈ గిరిజన బిడ్డలు శానిటరీ న్యాప్కిన్ల తయారీలో రాణిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివాసీ మహిళలు సాధించిన విజయమిది.

ఆ రోజు కూలి పని దొరికితే సరే సరి. లేదంటే ఆకలితో ఉండాలినసందే! అలాంటి పరిస్థితి నుంచి మార్కెటింగ్ మెలకువలతో వ్యాపారాన్ని కొత్తపుంతలు తొక్కించే స్థాయికి ఆదివాసీ మహిళలు వెళ్లారంటే గొప్పవిషయమేగా! లలిత, వెంకటలక్ష్మి, మంగా వీణ, సమ్మక్క, సుక్కమ్మ వంటి వారంతా పరిశ్రమ లోకి రాకముందు రోజువారీ కూలీలుగా ఉండేవారు. ఏజెన్సీ ప్రాంతంలో తగిన ఉపాధి లేక ఎన్నో ఇబ్బందులు పడ్డారు. వీళ్ల జీవితాల్లో మార్పు రావాని 2016లో ఐటిడిఎ అధికారులు శానిటరీ న్యాప్కిన్ల తయారీ పరిశ్రమను నెలకొల్పారు. అనుభవలేమి, నష్టాలతో ఆ ప్రయత్నం విఫలమైంది.

దాంతో అధికారులు మరిన్ని జాగ్రత్తలు తీసుకుని రెండో ప్రయత్నం చేశారు. హైదరాబాద్, ముంబయి, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో నాప్కిన్స్ తయారీ ఎలా ఉంటుందో అధ్యయనం చేయించారు. శిక్షణ ఇప్పించారు. మహిళల్లో ఆత్మవిశ్వాసం వచ్చాక 2018లో ఆధునిక మెషినరీని సమకూర్చారు. ప్రభుత్వ రాయితీ, బ్యాంకు రుణంతో ఆదివాసీ మహిళలూ తాము దాచుకున్న సొమ్ముని పెట్టుబడిగా పెట్టారు. అలా 2020 నుంచి న్యాప్కిన్ల ఉత్పత్తి మొదలైంది. గిరిజన సహకార సంస్థ (జిసిసి) సాయంతో మార్కెటింగ్‌పైనా పట్టుసాధించారు. మొదట్లో ఆశ్రమ పాఠశాలలకు ఈ స్యాప్కిన్లను సరఫరా చేసేవారు. ఆ తరవాత కళాశాలలు, ఎస్సీ, ఎస్టీ గురుకులాలు, జెడ్పీ ఉన్నత పాఠశాలలకు నెలకు 60 వేల వరకూ న్యాప్కిన్స్ తయారుచేసేవారు. అంతా బాగుందనుకుంటే కొవిడ్ ముంచుకొచ్చింది. ఆర్డర్లు లేవు. పరిస్థితి మొదటికొచ్చింది. ఆ స్థితి నుంచి కోలుకోవడానికి సమయం పట్టినా నాణ్యతలో రాజీపడకుండా తిరిగి ఆర్డర్లు సంపాదించారు. ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మ, వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లోని విద్యాసంస్థలకు తమ ఉత్పత్తులను అందిస్తున్నారు. ఒక్కో మహిళా నెలకు సుమారు రూ.10-15వేల వరు సంపాదిస్తున్నారు. వీరిన ఇఱిసి మరికొందరూ చిన్న పరిశ్రమల స్థాపనకు ముందుకొస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

ఫ్రిజ్‌ను ఎలా వాడుతున్నారు?

మారుతోన్న కాలానికి అనుగుణంగా మనలో చాలామంది ఇళ్లలో ఫ్రిజ్ వాడకం పెరిగింది. తాజా పండ్లూ, కూరగాయలూ, పాలు, మిగిలిన కూరలేవైనా సరే.. మొదట వెళ్లేది ఫ్రిజ్‌లోకే కదా! ఆహారం పాడవకుండా ఉంటుందనుకుంటాం కానీ, దానివల్ల కలిగే నష్టాలూ బోలెడు.. వండిన ఆహారమైనా, వండనిదైనా సరే.. ఫ్రిజ్‌లో పెడితే అందులోని పోషకాలు ముఖ్యంగా విటమిన్-సి, బి లు నాశనమవుతాయట. చల్లని వాతావరణంలో బ్యాక్టీరియా వృద్ధిచెందే అవకాశమూ ఎక్కువే. తద్వారా రోగనిరోధక శక్తి తగ్గిపోయి జలుబు, దగ్గు, జ్వరం..లాంటి వైరల్ వ్యాధుల బారినపడతాం. మొదట రుచిలో మార్పు కనిపిస్తుంది. ఆ తరవాత వాసన కూడా మారిపోతుంది. దీర్ఘకాలం ఇలానే తింటుంటే అనారోగ్యం పాలవుతామని చెబుతున్నారు నిపుణులు. ఎలా భద్రపరచామనననదీ ముఖ్యమే.. నిజానికి ఒక్కో ఆహార పదార్థాన్నీ ఒక్కో ఉష్ణోగ్రత వద్ద భద్రపరచాలి. వండినవీ, వండకుండా ఉన్నవీ, పాల ఉత్పత్తులు.. వంటివన్నీ వేటికవే వేరుగా ఉంచాలి. వండిన ఆహారాన్ని గ్లాస్ లేదా మెటల్ డబ్బాల్లో ఉంచడం శ్రేయస్కరం. పచ్చి కూరగాయలూ, పండ్లలో నీటిశాతం తగ్గకుండా జాగ్రత్తపడాలి. ఎక్కువగా ఫ్రిజ్‌లో ఉంచిన ఆహారం తినే వాళ్లు తరచూ అనారోగ్యాలకూ గురవుతున్నారట. కమర్షియల్ కంటే ఇంట్లో రిఫ్రిజిరేటర్ వల్ల ఆహారం కలుషితం అయ్యే అవకాశాలు మూడురెట్లు అధికంగా ఉన్నాయని పరిశోధనలూ చెబుతున్నాయి. కాబట్టి, ఫ్రిజ్‌లోని ఆహారానికి సరిగా మూతలు పెట్టడంతోపాటు ఎక్కువరోజులు ఆహారం నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఫ్రిజ్‌ను ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలి. డైరీ ఉత్పత్తులూ, వండిన ఆహారం, వండని కూరగాయలూ, పండ్లూ వంటి వాటిని విడివిడిగా సర్దుకోఆలి. అన్నింటికంటే ముఖ్యంగా ఫ్రిజ్‌లో అవసరముననవీ, లేనివీ పెట్టేసి నింపేయ కూడదు. దానివల్ల పోషక విలువలు తగ్గిపోవడమే కాక, నాణ్యతా తగ్గుతుంది. కాబట్టి, అవసరమై నంత మేరకే వండుకోవడం అలవాటు చేసుకోవాలి. ఒక్కోసారి మిగిలినా, వెంటనే తినడానికి ప్రయత్నించాలి. అప్పుడే ఆరోగ్యంగా ఉండగలం.

ఎర్రకోటలో తెలుగు మహిళలు

ఊరి బాగుకోసం, జిల్లా అభివృద్ధి కోసం, సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించారు. సొంత డబ్బునీ ఖర్చుపెట్టారు. అందుకే ఈ రోజున ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ప్రధాని ఎగరవేయడం మనమంతా టివిల్లో చూసి ఆనందిస్తే.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఈ మహిళలు నేరుగా పాల్గొనే అరుదైన గౌరవాన్ని అందుకున్నారు.

మన్యం మెచ్చిన సర్పంచ్..! అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు సమీపంలో ఉంది మినుములూరు పంచాయతీ. 2021 ఫిబ్రవరిలో లంకెల చిట్టెమ్మ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అప్పటికి కొవిడ్ భయం ఇంకా తగ్గలేదు. దీంతో చిట్టెమ్మ సొంత డబ్బులతోనూ, మన్యంలో సేవలందిస్తున్న 'ఏకలవ్య ఫౌండేషన్' సహకారంతోనూ 10 టన్నుల నిత్యావసర సరకులు అందజేశారు. ఆ సంస్థ సహకారంతోనే 350 మంది రైతులతో పాడేరు రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసి అన్నదాతలకు అండగా నిలిచారు. గ్రామంలో 10 కంప్యూటర్లను ఏర్పాటు చేసి స్థానిక యువతకు శిక్షణ ఇప్పించారు. దాతల

సహాయంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సదుపాయాలు కల్పించారు. రైతులకు విత్తనాలు, మొక్కలు పంచిపెట్టారు. మహిళలకు కుట్టు మిషన్లపై శిక్షణ ఇప్పించారు. చిట్టెమ్మ పట్టుదల కృషిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల నక్రితం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ అవార్డును రూ.10 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని అందించింది. రాష్ట్ర ప్రభుత్వం మినుములూరును ఉత్తమ పంచాయతీగా గుర్తించింది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం నుంచి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరవ్వాల్సిందిగా పిలుపు రావడం చిట్టెమ్మను ఆనందంలో మునిగి తేలేలా చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ముగ్గురు సర్పంచులకు ఈ గౌరవం దక్కగా ఉత్తరాంధ్ర నుంచి చిట్టెమ్మకు ఈ అవకాశం దక్కింది.

నమ్మకాన్ని నిలబెడతాను.. చదువుకున్నా.. ఉద్యోగం వైపు కాకుండా, గ్రామాభివృద్ధికి అడుగులు వేశారు కవిత. ఈమె అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం మండలం, గోళ్ల గ్రామ పంచాయతీ సర్పంచ్. ఎంఎ తెలుగు పూర్తిచేశారు. భర్త బొజ్జన్న వ్యవసాయం చేస్తారు. 2021లో

సర్పంచ్‌గా గెలుపొందిన కవిత, గ్రామంలో సొంత నిధులతో బోరు మోటర్లు, పైప్‌లైన్ల లీకేజీల మరమ్మతులు, పారిశుద్ధ్య పనులను చేయించారు. కేరళలో 2022 జులైలో దేశ స్థాయిలో జరిగిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల కార్యక్రమానికి గోళ్ల పంచాయతీ కార్యదర్శి హేమలత హాజరయ్యారు. 2022-23 సంవత్సరంలో ఉత్తమ పంచాయతీగానూ ఈ గ్రామం ఎంపికైంది. అంతేకాదు, కేంద్ర ప్రభుత్వం రూ.50వేలు నగదు బహుమతినీ అందించింది. ఈ నెల 15న న్యూఢిల్లీ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కవిత 20 నెలల బిడ్డ రుద్విన్‌తో సహా పాల్గొన్నారు. సర్పంచ్‌గా గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నాను. ఈ ఆహ్వానం రావడం ఎంతో సంతోషంగా ఉంది అంటున్నారు. 34 ఏళ్ల కవిత.

చిన్ననాటి కోరిక.....
విశాఖకు చెందిన వడిసెల లిఖిత సెయింట్ జోసఫ్

కళాశాలలో బిఎ చివరి ఏడాది చదువుతోంది. అమ్మ భాగ్యలక్ష్మి, నాన్న ఉమామహేశ్వర కొండలరావు కారు డ్రైవర్. తాతయ్య ప్రొఫెసర్ బి.ప్రసాదరావు ప్రోత్సాహంతో పాఠశాల స్థాయి నుంచి చదువుతో పాటు సామాజిక, సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా ఉండేది. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ (ఎన్‌వైకెఎస్) ఆధ్వర్యంలో ర్యాలీలు, తీరప్రాంత పరిశుభ్రతతో పాటు నేవీ, ఇతర మారథాన్‌లలో వలంటీర్‌గా ఉండేది. ఇటీవల విశాఖలో నిర్వహించిన జిల్లా యూత్ పార్లమెంట్‌లో తొలి స్థానంలో నిలిచింది. రాష్ట్రస్థాయిలో విశాఖ తరఫున పాల్గొని మేకిన్ ఇండియా.. విశ్వగురు అనే అంశంపై మాట్లాడి అందరి ప్రశంసలు పొందింది లిఖిత. చిన్నప్పటి నుంచీ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలనే కోరిక ఉండేది. ఎన్‌వైకెఎస్ ద్వారా మైభారత్ పోర్టల్ లో నమోదు చేసుకున్నా. అనూహ్యంగా స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక అతిథిగా ఆహ్వానం అందింది. వేడుకల్లో నేరుగా పాల్గొంటానని ఎప్పుడూ ఊహించ లేదు. చాలా సంతోషంగా ఉంది అంటోంది 20 ఏళ్ల లిఖిత.

మాకు దక్కిన గౌరవం...

దేశరాజధాని ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్యవేడుకలకు పంచాయతీరాజ్ విభాగం నుంచి గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనిక్రిస్టినా పాల్గొన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా పలు అభివృద్ధి పనులు చేపట్టాం. గత రెండేళ్లుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివే విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ పేరుతో అన్ని పాఠ్యాంశాలకు సంబంధించిన కీలకమైన అంశాలతో తయారు చేసిన పుస్తకాల్ని జడ్పీ నిధుల ద్వారా అందించి విద్యాభివృద్ధికి తోడ్పడ్డాం. ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో జిల్లా పరిషత్ ఆస్తులు, భూములు అన్యాక్రాంతమైన వాటిని స్వాధీనం చేసు కోవడంతో పాటు రక్షణ చర్యలు చేపట్టాం. ఇలా పల్లెప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపట్టడంతో రాష్ట్రంలో మాకు అరుదైన గౌరవం దక్కింది. ఢిల్లాలో జరిగే కార్యక్రమంలో మాట్లాడే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నా అంటున్నారు హెనిక్రిస్టినా.

మారుమూల ఉన్నా గుర్తించారు...

గ్రామీణ వాతావరణంలో పుట్టి పెరగడం, వ్యవసాయ కుటుంబం కావడంతో చిన్నప్పటి నుంచి స్థానిక, రైతు సమస్యలపై అవగాహన పెంచుకున్నారు పశ్చిమగోదావరి జిల్లా, వీరవాసరం ఎంపిపి వీరవల్లి దుర్గాభవానీ. అమ్మాయిలకు చదువు ఎందుకనే సమయంలోనూ తన తల్లిదండ్రులు ఆమెను బిఎ వరకు చదివించారు. పెళ్లయిన తర్వాత భర్త వీరవల్లి చంద్రశేఖర్ తోడ్పాటుతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలో చెరువుల తవ్వకం, పూడికలు తీయించడం, పైపులైను ద్వారా మంచినీటిని అందించారు. మండలంలో ఆయా గ్రామాల్లో అక్షరాస్యత, పరిశుభ్రత, మధ్యపాన నిషేధం, మౌలిక వసతుల కల్పన కోసం కృషిచేశారు. ఎక్కడో మారుమూల గ్రామమైన తోలేరు నుంచి నన్ను ఎంపిక చేయడం చాలా ఆనందంగా ఉంది

వాలంటీర్లకు పనులు కేటాయించాలి

సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మదనపల్లె, అక్టోబర్ 27 ప్రభాతవార్త :

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు వాలంటీర్లకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాలంటీర్లకు వర్క్ కేటాయించకుండా వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తోందని సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్. నరసింహులు ఆరోపించారు. స్థానిక ఎస్‌టియు కార్యాలయంలో ఏఐటియుసి ఆధ్వర్యంలో వాలంటీర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలల కావస్తున్నా నేటికి వాలంటీర్లకు ఎలాంటి వర్క్ కేటాయించడం లేదని ఇప్పటికే వాలంటీర్లు అనేక మంది రాజీనామాలు చేశారని తక్షణమే వాలంటీర్లకు వర్క్ కేటాయించి గౌరవ వేతనం రూ.10వేలు చెల్లించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2,60లక్షలు మంది ఉన్న వాలంటీర్లకు కూటమి ప్రభుత్వం ఎవరిని తొలగించబోమని తెలిపారు. నవంబర్ 3న మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని వాలంటీర్లు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కోశాధికారి సలీంబాషా, ఏఐటియుసి మదనపల్లె పట్టణ కార్యదర్శి తిరుమల, మాదవ్‌కుమార్, మురళి, వాలంటీర్ల అసోసియేషన్ నాయకులు ఫయాజ్, వెంకటశివ, వెంకటాచలపతి, శ్రీనివాసులు, పవన్‌కుమార్, వెంకటరెడ్డి, గౌతమి, సుధారాణి, స్వాతి, జయలక్ష్మి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ రాష్ట్రమహాసభలు విజయవంతం చేయండి

ఏఐఎస్ఎఫ్ నాయకులు పిలుపు

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మదనపల్లె, అక్టోబర్ 27 ప్రభాతవార్త :

అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు విజయనగరంలో నవంబర్ 27నుంచి 30వరకు జరుగుతున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ఆదివారం ఎస్‌టియూ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. జిల్లా కార్యదర్శి మాదవ్ మట్లాడుతూ విజయనగరంలో జరిగే 49వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని తెలిపారు. విద్య ప్రైవేటీకరణ కార్పోరేటీకరణ కాషాయకరణకు వ్యతిరేనకంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి లోకం ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే రాష్ట్రంలో చాలా విద్యాసంసనభధలు మూతబడడం కూడా జరిగిందని తక్షణమే జాతీయ నూతన విద్యావిధానం రద్దు చేయాలన్నారు. వైద్య విద్యను ప్రైవేటీకరణ చేస్తున్న జీఓ నెంబర్ 107, 108ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం మాట నిలబెట్టుకొని జీఓ నెంబర్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ భవిత, వినయ్, సహాయకార్యదర్శి భానుప్రసాద్, ఇలాహీ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు కార్తీక్, షారూక్, పట్టణ నాయకులు హర్ష, నవదీప్ పాల్గొన్నారు.

బాణ సంచా విక్రయదారులు జాగ్రత్తలు పాటించాలి

మాట్లాడుతున్న తహశీల్దార్

మదనపల్లె, అక్టోబర్ 27 ప్రభాతవార్త :

నిమ్మనపల్లె మండలంలో బాణసంచా విక్రయదారులు ప్రజలకుఎలాంటి హాని జరగకుండా జాగ్రత్తలు పాటించలని తహశీల్దార్ ధనాంజనేయులు పేర్కొన్నారు. దీపావళికి ఏర్పాటుచేసే బాణసంచా స్థలాలను మండల స్థాయి అధికారులుతో ఆయన పరిశీలించి మాట్లాడుతూ బాణసంచా విక్రేతలు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అధికారులు సూచించిన ప్రదేశాల్లోనే బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసి ప్రతి దుకాణం వద్ద రెండు అగ్ని నిరోదక సిలిండర్లను, బకెట్లు ఇసుక, నీటిని అందుబాటులో ఉంచాలన్నారు. అనుమతులు లేకుండా ఎవరైనా బాణసంచా విక్రయాలు జరిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. నిమ్మనపల్లె-మదనపల్లె మార్గంలో విక్రయ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తిప్పేస్వామి, ఆర్ఐ రామ్‌ప్రసాద్, వాల్మీకిపురం అగ్నిమాపక సిబ్బంది, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్లో మదనపల్లె పేరు మార్మోగిపోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మదనపల్లెక్రైం, అక్టోబర్ 27 ప్రభాతవార్త :

మదనపల్లెలో వేలాది మంది క్రికెట్ క్రీడాకారులు ఉన్నారని, కానీ ప్రోత్సహం లేక వారందరనూ నియోజకవర్గ స్థాయికి పరిమితమయ్యారని క్రికెట్ సీనియర్ క్రీడాకారులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రైవేటు పంక్షన్‌హాలులో కేఎస్ఎస్‌బి క్రికెట్ క్లబ్ ఖాదర్‌బాబ ఆధ్వర్యంలనో సీనియర్ క్రికెట్ క్రీడాకారులు భవిష్యత్తు క్రికెట్ క్రీడాకారులతో సమావేశం నిర్వహించారు. సీనియర్ క్రీడాకారులు మాట్లాడుతూ గత 20ఏళ్ళుగా మదనపల్లెలో క్రికెట్ క్రీడాకారులు ఉన్నవారిని ప్రోత్సహించేవారు లేక ఇక్కడే మిగిలిపోయారన్నారు. క్రీడాకారులోని సామర్థ్యాన్ని గుర్తించి పెంచితే జిల్లాస్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎదిగే నేషనల్ ఆడే సత్తా మదనపల్లె క్రీడాకారులకు ఉందన్నారు. ప్రస్తుతం కెఎస్ఎస్‌బి క్రికెట్‌క్లబ్ భవిష్యత్తు క్రీడాకారులు ప్రోత్సహించడానికి ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. వీరికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, సహాయ సహకారాలు అందిస్తామని సీనియర్ క్రీడాకారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి సీనియర్ క్రీడాకారులు సిరాజ్, ఫయాజ్ అహమ్మద్, ఎల్ఎన్.ప్రసాద్‌రెడ్డి, నూర్‌అహమ్మద్, రంజీ క్రీడాకారుడు షోయబ్ అహమ్మనద్, హరిప్రసాద్, వెంకటేష్ కోచ్ జనార్థన్, నరిబాబాయ్, హరి, ఆజాద్. చంద్రశేఖర్, జ్ఞానేశ్వర్, ఆడిటర్ వినోద్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌కు సేవా పురస్కారం

ములకలచెరువు, అక్టోబర్ 27 ప్రభాతవార్త :

పురస్కారం అందుకొంటున్న దృశ్యం

పిటిఎం మండలంలోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమారికి ఆదివారం చిత్తూరుజిల్లా గంగవరంలో తెలుగు సాంస్కృతిక సాహిత్య సమితి పుష్కరసేవా పురస్కారం అందించారు. వ్యక్తిత్వ వికాసం క్రీడలు భాషా సాహిత్య సాంస్కృతిక అంశాలలో అత్యత్తమ ప్రదర్శన కనపరచినందుకు పురస్కారం లభించిందన్నారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక వ్యవస్థాపకులు తులసినాధం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వి యూనివర్శిటి ప్రొఫెసర్ కిరణ్ క్రాంతి చౌదరి అష్టావదాన అముదాల మురళి, కార్యదర్శి పుష్పలీల పెద్దపంజాణి ఎంపిడిఓ పలమనేరు బాలాజి పాల్గొన్నారు.

మానవతా సంస్థ నెలవారి సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న సంస్థ అధ్యక్షులు శెట్టి సుబ్రమణ్యం

పీలేరు, అక్టోబరు 27 ప్రభాతవార్తః

స్థానిక ఆర్యవైశ్య కళ్యాణంలో మానవతా సంస్థ అధ్యక్షులు శెట్టి సుబ్రమణ్యం అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో నిర్వహించిన వినూత్న కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ మానవతా సంస్థ తరపున పీలేరులో ప్రతినెల ఏదో ఒక వినూత్న సేవా కార్యక్రమం నిర్వహించాలని అభిప్రాయాన్ని తెలియజేశారు. అందుకు అనుగుణంగా ఈ నెలలో ఒక వినూత్న సేవా కార్యక్రమం నిర్వహించాలని భావిస్తూ పీలేరులోని అనాధలకు వద్దాశ్రమంలోని వద్దులకు, అనాధ ఆశ్రమంలోని చిన్నప్లిలలకు దుప్పట్లు పంపిణీ చేయుటకు నిశ్చయించారు. అందుకొరకు తీర్మాణం కూడా చేశారు. మానవతా సేవా సంస్థ కార్యాలయం అనుకూలంగా లేనందువల్ల సమావేశ నిర్వహణకు అనుకూలంగా తక్కువ అద్దెలో ఓ కార్యాలయ గదిని బాడుగకు తీసుకొనుటకు ప్రతిపాదించడమైంది. అందుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలను పరిశీలించవలసిందిగా కమిటీ సభ్యులను కోరారు.అనంతరం ఛైర్మన్ రామచంద్రయ్య మాట్లాడుతూ మానవత సంస్థకు తమ వంతు సహకారంగా రూ.5వేలు విరాళంగా అందజేసిన డాక్టర్ సి.చంద్రయ్య చైతన్య జూనియర్ కళాశాల యాజమాన్యం వారికి మానవత సంస్థ దన్యవాదాలు తెలియజేశారు. ఈసమావేశంలో శెట్టి సుబ్రమణ్యం, కోశాధికారి జగన్‌మోహన్, కార్యదర్శి బీవీ.సురేష్ కోఛైర్మన్ కష్ణమూర్తి, కన్వీనర్ వెంకటరమన, సభ్యులు నాగరాజ, రామకష్ణ, మహమ్మద్‌షఫీ, ఖలీల్ బాషా, అక్రమ్‌బాషా, రహత్‌బాసా, వద్దాశ్రమ నిర్వాహకులు విజయకుమారి, ఆనంద, పెంజూరి, అశోక్ రమేష్, సుధాకర్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తా

సిద్దవటం, అక్టోబరు 27, ప్రభాతవార్త:

ప్రజాసమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకట సుబ్బయ్య అన్నారు. ఆదివారం ఉదయం ఆయన బొగ్గిడివారిపల్లె, నేకనాపురం పంచాయతీలలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయనకు నేకనాపురం గ్రామస్థులు పలు సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, ఎన్టీఆర్ గృహాలు, అలాగే నూతన ఆలయ నిర్మాణం తదితర సమస్యలు తీసుకురాగా వాటిని పరిష్కరిస్తానని తెలిపారు. ఆయన వెంట టీడీపీ యువ నాయకుడు పుత్తా రాజు తదితరులు పాల్గొన్నారు.

సుగవాసితో పుత్తా రామచంద్రయ్య భేటీ

సిద్దవటం, అక్టోబరు 27, ప్రభాతవార్త:

రాజంపేట నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యంతో ఆదివారం భాకారాపేట గ్రామ నివాసి తెదేపా పార్లమెంటు ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య మర్యాద పూర్వకంగా ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాలు మండల పరిధిలో చేపట్టాలని ఆయన ఆదేశించినట్లు తెలిపారు. మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీలో ఉన్న తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని ఆయన వెల్లడించినట్లు తెలిపారు.

గోడౌన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పుట్టా

చాపాడు, అక్టోబర్ 27, ప్రభాతవార్త:

చాపాడులోని ప్రసన్న ఆంజనేయ రూరల్ ధాన్యం నిల్వ గోడౌన్‌ను ఆదివారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ చాపాడు మండలంలో వరి పంట విస్తారంగా రైతులు సాగు చేయడం జరుగుతుందన్నారు. ఆ పంట ద్వారా వచ్చే వరి ధాన్యాన్ని నిల్వ చేసుకోవడానికి ఈ గోడౌన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన సూచించారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు-సీఐ

చాపాడు, అక్టోబర్ 27, ప్రభాతవార్త:

గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ శివశంకర్ తెలిపారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక చాపాడు పోలీస్ స్టేషన్ నందు బెల్టు షాపుల నిర్వాహకులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సంధర్భంగా సీఐ మాట్లాడుతూ బెల్టు షాపులు నిర్వహిస్తే బైండోవర్ కేసులతో పాటు, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తర్వాత కూడ నిర్వహిస్తే తహసీల్దార్ సూరిటితో పాటు లక్షకు పైన డబ్బులు కట్టవలసి ఉంటుందన్నారు. అదేవిధంగా గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్వహణకు సహకరించే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మహమ్మద్ బాష, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గ్యార్మి పండుగ

దువ్వూరు, అక్టోబర్ 27, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులోని దర్గా వీధిలో వెలిసి ఉన్న శ్రీ హజరత్ మహబూబ్ సుబహాని దస్తగిరి స్వామి పండుగ సోమవారం నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ సంధర్భంగా రాత్రి ఉర్దూ పాఠశాల నుండి దర్గా వరకు మేళతాళాలతో జెండా ఊరేగింపు నిర్వహిస్తారన్నారు. అలాగే సోమవారం మధ్యాహ్నం గ్యార్మి పండుగ సంధర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పులివెందుల రూరల్, అక్టోబరు 27, ప్రభాతవార్త ః

పులివెందుల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1997-99 బ్యాచ్ సీఈఈ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పట్టణంలోని అభిరుచి రెస్టారెంట్‌లో పూర్వ విద్యార్థులు కలిసి గత స్మృతులను నెమరు వేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. అప్పటి ప్రిన్సిపల్ అంకిరెడ్డి, సాంబశివారెడ్డి, బయపురెడ్డి, కృష్ణయ్యలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అంకిరెడ్డి మాట్లాడుతూ పాతికేళ్ల తరువాత అప్పటి విద్యార్థులు ఒకేచోట కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

ఒకరు రాసిచ్చిన స్క్రిప్ట్ చదవాల్సిన దుస్థితి కాంగ్రెస్‌కు లేదు

- జగన్‌కు డబ్బు పిచ్చి, అధికార పిచ్చి

వేంపల్లె, అక్టోబరు 27, ప్రభాతవార్త ః

పిచ్చి రకరకాలు.. ఒక్కొక్కరికి ఒక్కొక్కలా ఉంటుందని, జగన్‌కు ఉన్నది డబ్బు పిచ్చి, అధికార పిచ్చి అని, వాటి కోసం ఎంతకైనా దిగజారుతాడని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాజశేఖర్‌రెడ్డి మరణం కుట్రపూరితం అని, దీనికి కారణం రిలయన్స్ అధినేత ముఖేష్ అంబాని అని వైకాపా శ్రేణులను రెచ్చగొట్టాడన్నారు. వైకాపా శ్రేణులు రిలయన్స్ ఆస్తుల మీద దాడులు చేసి విధ్వంసం సృష్టించాయని తెలిపారు. అధికారంలోకి వచ్చాక ముఖేష అంబానీకి ఘన స్వాగతం పలికి, ఆయన సిఫార్సు చేసిన పారిశ్రామిక వేత్త పరిమళ నత్వానికి రాజ్యసభ సీటు ఇచ్చిన జగన్ ఎంతటి అపద్ధమైన సులభంగా చెప్పగలడనేందుకు ఇది ఒక ఉదాహరణ అన్నారు. ఆస్తికోసం నవమాసాలు మోసి కన్నతల్లి మీదనే కోర్టు కెక్కాడన్నారు. చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్ షర్మిళ చదువుతోందని మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మరికొందరు వైకాపా నాయకులు వ్యాఖ్యానించడం హాస్యాస్పదం అని తులసిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఒక వటవృక్షం అని, దానికి ఊడలు జగన్, చంద్రబాబులాంటి వాళ్లు అన్నారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవాల్సిన అవసరం షర్మిళకు లేదన్నారు. మద్యం సిండికేట్‌లు బెల్టుషాపులు పెట్టకుండా ప్రభుత్వం దృష్టి సారించాలని కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. మద్యంపాలసీ, బెల్టు షాపులపై సీఎం చంద్రబాబు వైఖరి ఉద్తర కుమార ప్రగల్భాలేనన్నారు. బెల్టు షాపుల నివారణకు ప్రభుత్వం దృష్టి పెట్టాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

ఏఐటీయూసీ గోడపత్రాలు విడుదల

వేంపల్లె, అక్టోబరు 27, ప్రభాతవార్త ః

ఈనెల 31న ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ గోడపత్రాలు విడుదల చేసినట్లు జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి కె.సి.బాదుల్లా అన్నారు. ఆదివారం స్థానిక జడ్పీ పాఠశాల ఆవరణలో ఆయన గోడపత్రాలు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించేందుకు కార్మిక శ్రేణులకు పిలుపునిచ్చారు. భవన నిర్మాణం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బల్లారపు రామాంజనేయులు, కోశాధికారి నాగేశ్వరరావు, ఏఐటీయూసీ సభ్యులు సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం

వేంపల్లె, అక్టోబరు 27, ప్రభాతవార్త ః

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వివిధ సేవలు అభినందనీయమని వైఎస్ఆర్‌సీపీ యువనేత సింగారెడ్డి తుషార్‌నాగిరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలోని శ్రీచైతన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన మానవత మాసాంతర సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉత్తమ సమాజ నిర్మాణమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్న మానవత సంస్థకు ఏ సహాయ సహకారాలు అందించేందుకైనా సిద్ధంగా ఉంటానన్నారు. మానవత ఛైర్మన్ చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ సభ్యత్వ నమోదు ఈనెలాఖరులోపు పూర్తి చేసి వచ్చే నిధులను సమాజ సేవకు ఉపయోగపడే విధంగా కృషిచేస్తామన్నారు. మానవత ఉపాధ్యక్షుడు డాక్టర్ యోగేశ్వర్‌బాబు సంస్థకు సంబంధించిన దస్త్రాలు, వస్తువులు భద్రపరిచేందుకు బీరువా అందిస్తానని ప్రకటించడం హర్షనీయమని తెలిపారు. మానవత సహాయ ఛైర్మన్ కావలి కృష్ణతేజ, కన్వీనరు రంగారెడ్డి, అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రావణ్, కార్యదర్శి శివ, కోశాధికారి శ్రీకళ, డైరెక్టర్లు రంగయ్య, రాజారాం, సభ్యులు ఎఫ్‌బీవో మధు, తేజేశ్వర్, శశిందర్‌రెడ్డి, గంగయ్య, డాక్టర్ అరుణ్, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి

వేంపల్లె, అక్టోబరు 27, ప్రభాతవార్త ః

తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వేంపల్లె మండల టీడీపీ కన్వీనరు రామమునిరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని తెదేపా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి అన్ని గ్రామాల్లో సభ్యత్వ నమోదుకు కృషిచేయాలని కోరారు. దంతో పార్టీ పటిష్టతతో పాటు కార్యకర్తలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. సభ్యత్వ నమోదు కార్యకర్తలకు కొండంత అండగా నిలుస్తుందని, వీరి సంక్షేమం టీడీపీతోనే సాధ్యమన్నారు. ప్రమాదభీమా రూ.2లక్షల నుండి రూ.5లక్షలకు పెంచినట్లు హర్షం వ్యక్తం చేశారు.

పల్లెల్లో మద్యం అమ్మితే కఠిన చర్యలు

పులివెందుల, అక్టోబరు 27, ప్రభాతవార్త ః

గ్రామాల్లో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై పెద్ద ఓబన్న హెచ్చరించారు. దుకాణ యజమానులతో ఆదివారం తొండూరు పోలీసుస్టేషన్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సంపాదనకు ఆశపడి అనుమతి లేకుండా మద్యం సీసాలను సరఫరా చేసి వాటిని అమ్మడం చట్టరీత్యా నేరం అని తెలిపారు. ఇటీవల కాలంలో ముఖ్యంగా యువకులు మద్యానికి బానిసలై తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పదే పదే పాల్పడితే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి

గాలివీడు, అక్టోబర్ 27(ప్రభాతవార్త):

తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గోపనపల్లి గ్రామానికి చెందిన మిట్టపల్లి వెంకటరమణారెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి కుమారుడు అయ్య భాస్కరరెడ్డి కుమారుని కేశఖండన కార్యక్రమానికి హాజరై బాలుడిని ఆశీర్వదించారు. లక్ష్మీప్రసాద్‌రెడ్డికి మేళతాళాలు భాజాబజంత్రీలతో ఘనస్వాగతం పలికి శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమ నిది కోసం సభ్యత్వ నమోదు చేసుకుని సంక్షేమనిధికి వంద రూపాయలు జమచేయాలన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక చొరవ చూపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, సర్పంచ్ పార్థసారథిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, మాజీ సర్పంచులు ఈశ్వరరెడ్డి, మహమ్మద్‌రఫీ, టీడీపీ నాయకులు కోటిరెడ్డి, మురళీనాయుడు, వెంకటచలపతినాయుడు, వీరారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, మిట్టేనాయక్, కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి గ్రామ కమిటీ అధ్యక్షులుగా రెడ్డప్ప

సన్మానం చేస్తున్న దృశ్యం

మదనపల్లెక్రైం, అక్టోబర్ 27 ప్రభాతవార్త :

జిల్లాలోని రామసముద్రం మండలంలోని జక్కన్నవారిపల్లె గ్రామంలో వాల్మీకి మహాసేన గ్రామకమిటీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాల్మీకి మహాసే గ్రామ కమిటీ అధ్యక్షులుగా కనపల్లి రెడ్డప్ప, కార్యదర్శిగనా కానపల్లి శ్రీరాములులను ఎన్నుకోవడ జరిగింది. అనంతరం 15మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని వ్యవస్థాపక అధ్యక్షులు నల్లబోడల సుదర్శన్‌బాబు, రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు ముత్తరాశి హరిక్రిష్ణ, జిల్లా అధ్యక్షులు బొగ్గిటి క్రిష్ణమూర్తిల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. గ్రామ సమస్యలపైన హరిక్రిష్ణ మాట్లాడుతూ గ్రామాలన్లో రోడ్డు సమస్యల పట్ల వాల్మీకులు చాలా వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులుగా బలసా వేనుగోపాల్ ఏకగ్రీవం

ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులుగా బలసావేణుగోపాల్

పీలేరు, అక్టోబరు 27 ప్రభాతవార్తః

స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఆర్యవైశ్యులు అందరూ సమావేశమై నూతన అధ్యక్షులుగా బలసావేణుగోపాల్‌ను ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు పీలేరు ఆర్యవైశ్యులు అందరికి రుణపడి ఉంటానన్నారు. ఈకార్యక్రమంలో మాజీ అధ్యక్షులు కూన సత్యం, మల్లికార్జున, గణపతి, సుధీర్, యర్రయ్యశెట్టి తులసి కష్ణ, బాలాంజనేయులు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉలవల గంగమ్మ తల్లి ఆలయానికి రూ.10వేలు విరాళం

పీలేరు, అక్టోబరు 27 ప్రభాతవార్తః

కానుకగా ఇస్తున్న ఎంఈఓ

మండలంలోని తలపుల గ్రామ పంచాయతీలో వెలసిన శ్రీశ్రీశ్రీ ఉలవల గంగమ్మ తల్లికి పులిచెర్ల మండల ఎంఈఓ పి.తాతయ్య రూ.10వేలు విరాళంగా అందజేవారు. ఆదివారం ఆయన అమ్మవారిని దర్శించుకుని ఆలయ అభివద్ధికి తనవంతు బాధ్యతగా ఈ నగదు కానుకను ఆలయ ధర్మకర్త వెంకటరమణ నాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గణేష్‌రాజు అమ్మవారికి ప్రత్యేక

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి

- విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలి - పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి చర్యలు

- రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి, అక్టోబరు 27, ప్రభాతవార్త:

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొని ఆరోగ్యంగా జీవించాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నేతాజీ స్కూలు, రాయచోటిలో 68వ రాష్ట్ర స్థాయి స్కూలు గేమ్స్ ఫెడరేషన్ అన్నమయ్య జిల్లా అండర్ 17 బాల బాలికల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో జరిగే కబడ్డీ పోటీలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. విద్యార్థినీ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని వాటిని సమానంగా స్వీకరించాలన్నారు. రాబోయే 2 సంవత్సరాల్లో రాయచోటి పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మన రాష్ట్రంలో జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించి రాష్ట్రాన్ని క్రీడా హబ్‌గా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. గతంలో కొంత మంది దొంగ సర్టిఫికెట్లు తెచ్చుకొని వ్యాయామ ఉద్యోగాలు పొందేవారని ఈ ప్రభుత్వంలో అలాంటి దొంగ సర్టిఫికెట్లు పొందేందుకు వీలు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. రాబోయే 5 సంవత్సరాలలో రాయచోటి పట్టణంలో అన్ని కార్యక్రమాలకు వేదికగా ఏర్పాటు చేసి ఈ ప్రాంతానికి మంచి గుర్తింపు తీసుకురావడం జరుగుతుందన్నారు.

ఈ కబడ్డీ పోటీలకు 13 జిల్లాల నఉంచి వచ్చిన క్రీడాకారులకు భోజన సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. సభా కార్యక్రమానికి ప్రార్థనాగీతం, జాతీయ పతాకావిష్కరణలతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమానికి హాజరైన అతిథులు క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడోత్సవాలను ప్రారంభించారు. అనంతరం కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

అసాధారణ పరిస్థితుల్లో తప్ప కేసుల పరిష్కారానికి నిర్దిష్ట కాల పరిమితి నిర్దేశించరాదు

(భారత అత్యున్నత న్యాయస్థానం స్పష్టీకరణ)

బద్వేలు లీగల్, అక్టోబరు 27 ప్రభాతవార్త :

కొన్ని అసాధారణమైన పరిస్థితులలో తప్ప వ్యాజ్యముల పరిష్కారమునకు భారత అత్యున్నత న్యాయస్థానంగానీ, రాష్ట్రాల అత్యున్నత న్యాయస్థానాలు గానీ క్రిమినల్ కేసుల పరిష్కారానికి నిర్దిష్ట కాల పరిమితిని నిర్దేశించకూడదని సుప్రీం కోర్టు సుస్పష్టం చేసింది. ఓ క్రిమినల్ కేసును నిర్దిష్ట కాల పరిమితిలో పరిష్కరించాలని కోరుతూ దాఖలైన పిటీషన్‌ను కొట్టివేస్తూ ఈ తీర్పును వెలువరించింది (షేక్ ఉజ్మా ఫిరోజ్ హుస్సేన్ ఎదిరి స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర ఎస్‌సి 978 ఆఫ్ 2023).

నగరవనాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

నగరవనంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె, అక్టోబర్ 27 ప్రభాతవార్త :

పట్టణంలోని స్థానిక పుంగనూరురోడ్డు అటవీశాఖ ఆధ్వర్యంలో నగరవణాన్ని పారెస్టు రేంజ్ అధికారి వేణుగోపాల్‌బాబుతో కలసి ఆదివారం ఎమ్మెల్యే షాజహాన్‌బాష సందర్శించారు. అటవీశాఖ ఆద్వర్యంలో రూ.2కోట్లు నిధులతో అభివృద్ధి చేసిన నగరవనం పనుల పట్ల ఎమ్మెల్యే సంతృప్తిని వ్యక్తం చేశారు. పిల్లలు ఆడుకునేందుకు పార్క్‌తో పాటు, వాకింగ్ ట్రాక్, బుద్ధ ఫౌంటేన్, యోగ సెంటర్‌ను నగరవనం పార్కులో అభివృద్ధి చేస్తున్నట్లు ఎఫ్ఆర్ఓ వేణుగోపాల్‌బాబు ఎమ్మెల్యేకు వివరించారు. నగరవనం ప్రాంతాన్ని క్షణ్ణంగా పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టిన నగరవనం పూర్తయితే పట్టణ ప్రజలతో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం, పిల్లలు ఆడుకునే వస్తువులతో పాటు, ఎంత సుందరంగా పార్కును అభివృద్ధి చేయడం చాలా సంతోషమని, రానున్న రోజుల్లో మరిని నిధులు తీసుకువచ్చి నగరవనం పార్కును అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు గుర్రప్పనాయుడు, రాజా, జేసిబి వేణు, రెడ్డిరాయల్, సురేంద్రర్‌రెడ్డి, మల్లీ, రఘుపతినాయుడు, బాబుకాలనీ నాయక్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నందీశ్వరుని భారీ విగ్రహావిష్కరణ

వేంపల్లె, అక్టోబరు 27, ప్రభాతవార్త :

మండలంలోని నందిపల్లెలో నందీశ్వరుని భారీ విగ్రహావిష్కరణ చేశారు. ఆదివారం నందిపల్లె గ్రామ సర్పంచి మారం సులోచనమ్మ చేతుల మీదుగా ఈ కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. నందిపల్లె శివాలయం డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటి ఆధ్వర్యంలో దాదాపు 6.5అడుగుల భారీ నందీశ్వరుని విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు సొసైటి అధ్యక్షుడు మారం శ్రీకాంత్‌రెడ్డి వెల్లడించారు. నందిపల్లె గ్రామానికి చిహ్నంగా నందీశ్వరుని విగ్రహం ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి, సొసైటి ఉపాధ్యక్షుడు చంద్ర ఓబుళరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామగంగిరెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీరామిరెడ్డి, కోశాదికారి రామలింగేశ్వరరెడ్డి, సభ్యులు ముతుకూరు రామాంజనేయరెడ్డి, తదితర సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సుగవాసి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు

రాజంపేట అర్బన్, అక్టోబర్ 27, ప్రభాతవార్త:

మండలంలోని మేకవారి పల్లెలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ టీడీపీ నేత బాలసుబ్రమణ్యం అక్కడే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని పలువురు ముఖ్య నేతలు ఈ కార్యక్రమంతో పాటు సభ్యత్వ నమోదులో కూడ పాల్గొన్నారు. ఈ సంధర్భంగా సుగవాసి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తలకు 5లక్షలు ఇన్సూరెన్స్ ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో రాజంపేట నియోజకవర్గం ప్రథమ స్థానం పొందేలా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గన్నే సుబ్బనర్సయ్య నాయుడు, పి.కొండయ్య నాయుడు, టి.లక్ష్మి నారాయణ, నాగినేని నాగేశ్వర్ రావు, గీతాంజలి వెంకటరమణ, మేకా నరసింహ, మేకవారి పల్లె రమణ, పి.సంజీవ రావు, మేక నరసింహ, చెంగల్ రాయుడు, ఊటుకూరు సర్పంచ్ మన్నేరు లక్ష్మి నారాయణ, చెంగల్ రాయుడు, దొంతం శివ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాజంపేటలో జరిగిన కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు సభ్యత్వం తీసుకున్నారు.

పోర్లుదండాల మొక్కును తీర్చుకున్న గురుస్వామి

- రాంప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిస్తే అమ్మవారి చెంతకు వస్తానని మొక్కు

లక్కిరెడ్డిపల్లె,అక్టోబర్ 27, ప్రభాతవార్త:

మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాయచోటి ఎమ్మెల్యేగా గెలిస్తే లక్కిరెడ్డిపల్లె మండలంలోని చౌటపల్లె పంచాయతీ గొల్లపల్లె రామాలయం నుంచి గంగమ్మ ఆలయం వరకు పొర్లుదండాలతో గంగమ్మ చెంతకు వస్తానని గతంలో మొక్కుకోవడం జరిగిందని గురుస్వామి సోడి వెంకటేష్ యాదవ్ తెలిపారు. దీంతో ఆదివారం రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో రామాలయం నుంచి గంగమ్మ ఆలయం వరకు గురుస్వామి వెంకటేష్ యాదవ్ పొర్లుదండాలతో పెద్ద ఎత్తున బాణ సంచాలతో, కోలాటాలు, సన్నాయి వాయిద్యాలతో గుడికి వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నేను ఎమ్మెల్యేగా గెలిస్తే పొర్లుదండాలతో గొల్లపల్లె రామాలయం నఉంచి గంగమ్మ గుడి వరకు వస్తానని అమ్మవారికి మొక్కుకోవడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. సోడి వెంకటేష్ గంగమ్మ చెంతకు రావడం, అనంతరం అమ్మవారికి మొక్కులు తీర్చుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు. నియోజకవర్గంలోని ప్రజల తనమీద ఎంతో ప్రేమ అభిమానంతో నన్ను గెలిపించారని, రాబోయే రోజులో రాయచోటి నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం జరుగుతుందని, ఇందుకు ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల యువ నాయకులు యనమల మదన్‌మోహన్, బిజెపి మండల అధ్యక్షులు కొండూరు వెంకట్రామరాజు, రాజంపేట డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి ఆదిమూలం రామచంద్ర, చెల్లు గంగరాజు, యాగంటి సుధీర్, చెల్లు శ్రీనివాసులు యాదవ్, విశ్వనాథ, రాయల్ తెలుగు యువత అధ్యక్షుడు పక్కీరయ్య, కొండయ్య, కొమ్మనపల్లె శివి, రెడ్డి శేఖర్ యాదవ్, మండిపల్లి అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ స్థాపనకు వందేళ్లు

గోపవరం, అక్టోబర్ 27 (ప్రభాతవార్త):

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం (ఆర్ఎస్ఎస్)ను స్థాపించి నేటికి 100 సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా శతజయంతికి ఆహ్వానం పలుకుతూ పట్టణంలో రూట్ మార్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా పోరుమామిళ్ల రోడ్డు గాంధీ బొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పలువురు మహిళలు వారికి పూలను చల్లుతూ ఘన స్వాగతం పలికారు. నిర్వహించి తిరిగి ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం సాయంత్రం సర్వజనికోత్సవం సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ప్రాంత గోస్ ప్రముఖ్ సత్యనారాయణ మాట్లాడుతూ 1925లో ఆర్ఎస్ఎస్ స్థాపించిన నాటినుంచి నేటికి శతజయంతికి ఆహ్వానం పలుకుతూ రూట్‌మార్చ్‌చేసి కులాలకు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా హిందువులను ఏకతాటిపై నడిపించడం ముఖ్యమైన బాధ్యతగా ఆర్ఎస్ఎస్ పనిచేస్తోందని, ప్రస్తుత పరిస్థితులలో హిందూ సంస్కృతి సాంప్రదాయాలు, ఆలయాలపై జరుగుతున్న దాడుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.ఈ కార్యక్రమంలో బద్వేలు ఖండ కార్యవాహ రాజశేఖర్‌రెడ్డి, బద్వేలు నగర కార్యవాహసాకి ఈశ్వరయ్య, జిల్లా బీజేపీ కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు, బద్వేలు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బిజివేముల భాస్కర్‌రెడ్డి, కత్తెరపల్లి, వెంకట సుబ్బారెడ్డి, బలిజసేవా సంఘం అధ్యక్షులు డి.వి. ఆర్యవైశ్యవర్తక సంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు, ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు కొండపల్లి వెంకట సుభాష్‌కుమార్, అక్కి సంజీవరెడ్డి, పి.నరసింహ, నానబాల వెంకటేశ్వర్లు, చిన్ని, పి. శ్రీనివాసులు, వేణుగోపాల్‌రెడ్డి, జనార్థనరాజు, నరసింహప్రసాద్, శివ శంకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, అంకయ్య, శశిధర్‌కుమార్, పాండురంగ, తిరుమల రెడ్డి, పెద్ది సుధాకర్, ధర్మిశెట్టి వెంకటయ్య, కుప్పాల నరసింహులు, కటారు రామయ్య, ముఖ శ్రీనివాసకుమార్, ఎల్ఐసీ సుబ్బారావు, నరహరి తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో ఆర్ఎస్ఎస్ ర్యాలీ విజయవంతం

పులివెందుల రూరల్, అక్టోబరు 27, ప్రభాతవార్త :

పులివెందుల పట్టణంలో ఆదివారం సాయంత్రం ఆర్ఎస్ఎస్ ర్యాలీ విజయవంతం అయింది. ఆర్ఎస్ఎస్ ఏర్పాటు చేసి 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100ఏళ్లలోకి అడుగు పెడుతున్న శుభా సందర్భంగా ఈ మహార్యాలీని నిర్వహించారు. ప్రతి ఏడాది విజయదశమి పర్వదినాన లేదా తరువాత రోజుల్లో ఈ ర్యాలీ నిర్వహించడం ఆనవాయితిగా వస్తోంది. పులివెందులలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఎస్ఎష్ కమిటి, హిందూ సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని రవితేజ స్కూల్ సమీపం నుండి ప్రధాన వీధుల గుండా పూలంగళ్ల కూడలి, పార్నపల్లె రోడ్డు మీదుగా నలంద హైస్కూల్ వరకు ర్యాలీ సాగింది. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పులివెందుల మండల అధ్యక్షులు, తదితరులు ప్రసంగించారు. మనలో ఐక్యత లేకనే అఖండ భారతదేశాన్ని మనం కోల్పోయామని తెలిపారు. మనం ఏ మతానికి, కులానికి వ్యతిరేకం కాదని, మనమంతా హిందువులమని, అఖండ భారతదేశం ఒకప్పుడు హిందూదేశమని తెలిపారు. ప్రస్తుతం ఉన్న దేశాన్నైనా మనం స్వచ్ఛందంగా కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో పాల్గొని క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీ గల వ్యక్తులుగా దేశాన్ని సంరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో మరింతమంది స్వయం సేవకులు ముందుకు వస్తారన్న ఆశాభావం కలిగిందన్నారు. ప్రతి ప్రాంతంలోను, ప్రతి గ్రామంలోను దేశభక్తికై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పులివెందుల పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ర్యాలీకి బందోబస్తు నిర్వహించారు.

వనితాక్లబ్ బెస్ట్ అధ్యక్షురాలి, సెక్రటరీలకు బెస్ట్ అవార్డులు

బద్వేలు అర్బన్, అక్టోబర్ 27 (ప్రభాతవార్త):

బద్వేలు పట్టణంలో2024వ సంవత్సరంలో వనితాక్లబ్ ద్వారా నిరంతరాయం సేవలందించిన వనితాక్లబ్ అధ్యక్షురాలు అక్కిశెట్టి జ్యోతిర్మయి, సెక్రటరీ పబ్బతి శ్రీదేవిలు బెస్ట్ అవార్డులను సొంతం చేసుకున్నారు. ఆదివారం పుట్టపర్తి అమ్మవారిశాలలో వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ రీజియన్ గవర్నర్ చుండూరు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డిస్కాన్ ప్రొగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వనితాక్లబ్ బెస్ట్ అధ్యక్షురాలుగా అక్కిశెట్టి జ్యోతిర్మయి, బెస్ట్ సెక్రటరీ పబ్బతి శ్రీదేవిలకు మరియు బెస్ట్ ఆల్బమ్ ప్రజంటేషన్ అవార్డును అందుకున్నారు. వారికి పట్టణంలో పలువురు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ వారి సేవలను అభినందించారు. బద్వేలు పట్టణంలో గత సంవత్సర కాలం నుంచి వనితాక్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ దసరా ఉత్సవాలలో కూడా పాల్గొని అమ్మవారిశాలలో సేవలందించారు. అలాగే అమ్మవారికి ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం వలన తమకు ఈ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పబ్బతి చక్రపాణి, అక్కిశెట్టి ప్రవీణ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో ఆర్ఎస్ఎస్ పథ సంచలన్

ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబర్ 27, ప్రభాతవార్త:

రాష్ట్రీయ స్వయం సేవక్ ప్రారంభమై 100సంవత్సరములైన సంధర్భంగా ఆదివారం పట్టణంలోని గీతాశ్రమం నందు ప్రొద్దుటూరు పట్టణ, గ్రామీణ ఖండ పథ సంచలన్ ఆర్ఎస్ఎస్ నగర కార్యనిర్వాహక అధ్యక్షుడు బాల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో స్వయం సేవకుల సమ్మేళనం, గనవేష్ పరిశీలన, సంచలన్ అభ్యాసం సూచనలు, సంపత, గీతాశ్రమం నుండి గాంధీరోడ్డు, విజయకుమార్ సర్కిల్, రాజీవ్ సర్కిల్, శివాలయం సర్కిల్, మైదుకూరు రోడ్డు రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద నుండి శ్రీరాముల పేట మీదుగా గీతాశ్రమం వరకు సంచలన్, పానీయ విరామం అనంతరం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థల నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వాలు

బద్వేలు అర్బన్, అక్టోబర్ 27 (ప్రభాతవార్త):

ప్రజా సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేశాయని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2027 లో దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలతో ప్రాంతీయ పార్టీలను నాశనం చేయాలనేది బీ జేపీ ఎన్నికల అజెండా అన్నారు. అలాగే కులగణన చేయకుండా ఏ సామాజిక వర్గ జనాభాను ప్రాతిపదికగా బడ్జెట్ పేదరిక నిర్మూలనకు కేటాయించకుండా అభివృద్ధి ఎలా సాధ్యమపడుతుందన్నారు. కార్పోరేట్ కంపెనీల శక్తితో బీజేపీ ఎన్డీఏ ప్రభుత్వాన్ని నడుపుతోందని, ఇది దేశ ప్రజా పోరాటాలకు తెరతీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అద్యక్షులు చిన్ని, సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, కమిటి సభ్యులు నాగేంద్ర, మోక్షమ్మ, పార్టీ శాఖ కార్యదర్శులు బాలమ్మ, మస్తాన్ బీ, తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్‌లు చేసుకున్న వారి యోగక్షేమాలు తెలుసుకున్న ఆకేపాటి, పోలా

రాజంపేట అర్బన్, అక్టోబర్ 27, ప్రభాతవార్త:

మాజీ సర్పంచ్ పోలా వెంకట రెడ్డి శతజయంతి సంధర్భంగా స్థానిక కాకతీయ కళాశాలలో గత నెలలో ఆపరేషన్ చేయించుకొని తిరిగి పరీక్షలు చేసుకున్న రోగులను ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ పోలా వెంకటరమణా రెడ్డిలు పరామర్శించారు. చెన్నైలో కంటి ఆపరేషన్ల అనంతరం పూర్తి స్థాయి చెకప్‌ను శంకర్ నేత్రాలయ హాస్పిటల్‌లో చేయించుకొని ఆదివారం రాజంపేటకు వచ్చారు. స్థానిక కాకతీయ జూనియర్ కళాశాలలో వారిని ఎమ్మెల్యే పలకరించారు. అక్కడే పరీక్షలు చేస్తున్న శంకర్ నేత్రాలయ వైద్యులను కంటి వైద్య సహాయకులతో మాట్లాడారు. రోగుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు కసిరెడ్డి రాజారెడ్డి, పార్థ, సౌమిత్రి, ఇలియాస్, దండు గోపి, మున్సిపల్ కౌన్సిలర్ సనిశెట్టి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితవాడ ప్రజలకు తాగునీరు అందించండి

సిద్దవటం, అక్టోబరు 27, ప్రభాతవార్త:

సిద్దవటం మండలం శాఖరాజుపల్లె గ్రామ పంచాయతీ మమ్ముడిగుంటపల్లె దళితవాడలో సుమారు 30 గృహాలకు మంచినీరు అందడం లేదని ఆ ప్రాంత మహిళలు శనివారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. వర్షం ప్రభావం వల్ల వర్షం నీరు నిల్వ వల్ల కొన్ని ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉన్నాయని అంటువ్యాధులు సోకకుండా అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. 1, 2, 3 వార్డుల పరిసర ప్రాంతాలు అపరిశుభ్రత పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. కడప-చెన్నై జాతీయ రహదారి మాధవరం సమీపాన పారిశుద్ధ్యం లోపం వల్ల అటు ప్రయాణికులకు, గ్రామ ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. తక్షణమే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. నీటిపై మండల విస్తరణాధికారి మెహతాబ్ యాస్మిన్ వివరణ కోరగా శాఖరాజుపల్లి గ్రామ పంచాయతీ ముమ్మడి గుంటపల్లె దళితవాడలో మంచినీటి సమస్య పరిష్కారం చేస్తామని అపరిశుభ్రత ప్రాంతాలను పూర్తిగా తొలగించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.